# ఆర్.ఎస్.సుదర్శనం

తెలుగు కాల్పనిక సాహిత్యాన్ని, విమర్శనా రంగాన్ని సుసంపన్నం చేసిన కొద్దిమందిలో ఆర్.ఎస్.సుదర్శనం ఒకరు. కథకుడుగా, నవలా రచయితగా కంటే సద్విమర్శకులుగా ఆయనకు ఎక్కువ పేరు వచ్చింది. 'మధుర మీనాక్షి', 'కాలం తెచ్చిన మార్పు' పేరుతో కథాసంపుటాలు వెలువడ్డాయి. ఎనభై సంవత్సరాల జీవితం గడిపి, ఇటీవలే వారు కాలధర్మం చెందారు. 'ఎరుపు' కథ వారి శైలికి, ఆలోచనా ధోరణికి నిలువుటద్దం.

# ఎరుపు

- ఆర్.ఎస్.సుదర్శనం.

ఆకాశం రక్తం కక్కింది. చూస్తూండగానే ఎరుపు చీకట్లలో కలిసి మాయమవుతున్నది. ఎదురుగుండా గుడిసెలో దీపం వెలిగింది. అది కూడా ఎంతోసేపు ఉండదు. తర్వాత చీకటి. ఏమీ కనిపించదు.

ప్రొద్దున ఏడు గంటల నుంచి పదింటిదాకా సారథి మేడ వెనుక వైపు వరండాలో కూర్చుని గమనించే సమయంలో ఆమె– ఆ గుడిసెలోని స్త్రీ వంట ప్రయత్నంలో ఉంటుంది. ఆ గుడిసెకీ, బయట తడికల్తో అమర్చిన నీళ్ల గదికీ మధ్య ఎన్నోసార్లు రాకపోకలు సాగిస్తూ ఉంటుంది. ఒక చట్టి, ఒక గిన్నె, ఒక గరిటె... ఏదో ఒకటి తెచ్చి కడిగి తీసుకువెళ్లడమో, నీళ్లు నింపి తీసుకువెళ్లడమో చేస్తూ ఉంటుంది. కోళ్లకు గింజలు చల్లుతూ ఉంటుంది.

ఆమె కదలికలు, రాకపోకలు చూడముచ్చటగా ఉంటాయి.

సాయంత్రం నాలుగు గంటలకు ముంగిలి వూడ్చి, నీళ్లు చల్లుతూ మళ్లీ దర్శనమిస్తుంది. ఆ పని పూర్తికాగానే స్నానం చెయ్యడానికి తడికల చాటుకి వెడుతుంది. కుచ్చెళ్లు పోసి పురితిప్పి తెచ్చుకున్న చాకింటి చీరని ఒకవైపు తడికె మీద పెడుతుంది. కట్టుకున్న బట్టలు విప్పి సారథి వైపున్న తడికె మీద వేస్తుంది. వివస్త్రగా నిల్చున్న ఆ క్షణంలో ఆమె ముఖం, చెయ్యి, భుజం అలా కనిపించి లిప్తలో అదృశ్యమవుతాయి. ధ్వని ప్రధానమైన వాక్యంలాగ ఆ దృశ్యం అతనిలో రసానుభూతి కలిగిస్తుంది. ఆమె కదలికల్ని చూస్తూ ఉండటంలో కలిగే మొత్తం ఆకర్షణకీ అది తారస్థాయి.

స్నానం పూర్తిచేశాక చీర చుట్టబెట్టుకుని గబగబా లోపలికి వెడుతూ కనిపించే దృశ్యంలో ఆకర్షణ ఉండదు. ఏదో చెప్పరాని నిర్వేదం అతని మనస్సుని ఆవరిస్తుంది.

సాయంత్రం అయిదున్నర ఆరు ప్రాంతంలో కాకీ దుస్తుల్లో వున్న ఒక వ్యక్తి– ఆమె భర్త– అక్కడికి

**ఆణిముత్యాలు**

వస్తాడు. వాకిటి ముందు మంచం వాల్చుకుని కూర్చుంటాడు. ఆమె టీ తెచ్చి ఇస్తుంది. అతను కబుర్లు చెబుతూ ఉంటాడు. ఆమె అటూ ఇటూ తిరుగుతూ కాస్సేపు వాకిలి ముందు, సారథి కెదురుగా నుంచుని, కాస్సేపు భర్త దగ్గరగా నుంచునీ నవ్వుతూ మాట్లాడుతూ ఉంటుంది. తాను ఆమెని చూస్తూన్నట్లే, తన ఉనికిని ఆమె కూడా గమనిస్తూ ఉంటుందనే సారథి అనుమానం.

ఆ భర్త రోజూ కనిపించడు. రెండు మూడు

రోజులకూ, ఒక్కోసారి వారం రోజుల తర్వాతా కనిపిస్తాడు. బస్సు డ్రైవరో, లారీ డ్రైవరో కావచ్చు. అతనెవరో, ఆమే, అతనూ, భార్యాభర్తలు అవుతారో కారో కూడా సారథికి తెలీదు. తెలుసుకోవాలనీ లేదు. ప్రత్యక్షంగా కనిపించేదేదో అందంగా, ఆకర్షకంగా ఉండగా, దాని అనుభూతితో సంబంధం లేని లౌకికమైన వివరాల్ని ఎందుకు తెలుసుకోవడం? తెలుసుకోవడంలో అర్థం, ఆనందమేమీ లేనప్పుడు!

నిస్సారమైపోయిన జీవితంలో ఇదే తనకు మిగిలిన 'సెక్స్' అనుభూతి. శారీరకమైన 'సెక్స్' నిషిద్ధం అన్నాడు డాక్టరు. అయిదు నెలల క్రితం రక్తం పడింది. క్షయ అని నిర్ధారణ అయినప్పుడు భయం వేసింది. మిగిలింది నిస్పృహ. వ్యాధి ప్రారంభ దశలోనే ఉన్నదనీ, శానిటోరియమ్‌కి ఎక్కడికీ వెళ్లనక్కరలేదనీ ధైర్యం చెప్పాడు డాక్టరు. వెళ్లినా వెళ్లకపోయినా శరీరం పనికిరానిదై పోయింది!

భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమెకు వ్యాధి సంగతి తెలీదు. వ్యాధి బయటపడటం, ఆమె ప్రయాణం కావడం రెండూ ఒక సమయంలోనే తటస్థించాయి. ఆలోచించడానికి వ్యవధి లేదు. పురుడు పోసుకోవడానికి వెళ్తున్న ఆమెతో వ్యాధి సంగతి చెప్పడమెందుకని చెప్పలేదు.

ఆమె వెళ్లిపోయాక క్రమంగా అర్థమైంది తన జీవితంలో వచ్చిన మార్పు. 'సెక్స్' నిషిద్ధమని డాక్టరు చెప్పినప్పుడు అర్థం కాలేదు గాని, ఇప్పుడు తెలుస్తోంది. మనస్సు శరీరం నుంచీ వేరుపడుతోంది: క్రమంగా అలా వేరుపడటంలోనే ఇదివరలో గుర్తించని సత్యాల్ని గుర్తిస్తోంది!

ఎదురుగుండా కనిపించే గుడిసెలోని ఆ స్త్రీ భర్తతో అలా కబుర్లు చెబుతూ, నవ్వుతూ ఉంటే మొదట్లో తనని కవ్విస్తూ ఉన్నట్లుండేది. సారథిలో అసూయ, బాధ కలిగేవి. లేచి వెళ్లిపోయేవాడు. మంచం మీద పడుకుని అదేపనిగా ఆలోచించేవాడు. ఎన్నో ఊహలు వచ్చేవి. ఆ కాకీ దుస్తుల వ్యక్తి గొప్ప అదృష్టవంతుడుగా కనిపించేవాడు. అతనిలో 'పరకాయ ప్రవేశం' చేసి ఆ జీవితాన్ని ఊహించుకునేవాడు. అలా మనస్సు రెక్క విప్పడంతో క్రొత్త సంగతులు అర్థమయ్యాయి. ఆ స్త్రీ మీద చొరవ, అధికారం లభించడం, ఆమెకు చేరువ కావడం, ఆమెను అనుభవించడం ఎంతో బావుంటుందని కోరిక చెబుతుంది. కాని యదార్థంలో తను ఆ కాకీ దుస్తుల వాడైనప్పుడు, తనకు అస్సలు నీళ్లగది సన్నివేశం కనిపించదు! అప్పుడు ఆ సమయంలో తను ఏ బస్సునో, లారీనో నడుపుతూ 'డ్యూటీ' మీద ఉంటాడు. సాయంత్రం టీ తాగుతూ ఎన్ని కబుర్లు చెప్పినా, రాత్రికి గాని, ఆ గ్రుడ్డి దీపం కాస్తా ఆర్పివేశాక గాని, అంటే చీకట్లో గాని ఆమె చేరువ కాదు! చీకట్లో అందానికీ, ఆకారానికీ- తన మనసు ఇప్పుడు పొందే రసానుభూతికి ఆస్కారం ఎక్కడ? అప్పుడు అంతా ఒక్కటే! సర్వం జగన్నాథం! ఆ చీకట్లో ఆమె ద్వారా లభించే శారీరకానుభూతికీ, ఇదివరకు తానెరిగి వున్న శారీరకానుభూతికీ తేడా ఏమైనా ఉంటుందా? ఉంటే ఎలా ఉంటుంది? తేడాలు ఏవైనా దృష్టి, మనస్సు తెచ్చిపెట్టేవే. కేవలం శరీరమే, స్పర్శే అయితే చీకట్లో దానికి తేడాలు తెలీవు! అలాంటప్పుడు ఆ లారీ డ్రైవరును చూచి అసూయపడటం దేనికి?

అసలు 'సెక్స్' మనస్సుకి సంబంధించిందా? శరీరానికి సంబంధించిందా? అని ప్రశ్న. భార్యను దూరం నుంచీ, కేవలం స్త్రీగా చూస్తూంటే ఎంతో ఆకర్షణగా ఉంటుంది. ఆమె 'భార్య'గా దగ్గర చేరి సంసార విషయాలూ, బంధువుల్ని గురించీ, డబ్బు గొడవా మాట్లాడినప్పుడు ఆ ఆకర్షణ ఉండదు. చికాకు కలుగుతుంది. ఆమెతో పక్కమీద చేరడంలో ఆకర్షణ తాలూకు ప్రేరణ ఉద్రేకాన్ని కలిగించినా, అనుభవ పర్యవసానంలో దాని స్పృహే కనిపించదు. పర్యవసానం నిస్సారంగా మృత్యువులా ఉంటుంది. రసరాహిత్యమే తప్ప రసానుభూతి తోచదు. మొదటి నుంచీ, పెళ్లయినప్పటి నుంచీ ఈ అనుభూతి అలానే ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. 'సెక్స్' అలవాటుగా, విధాయకంగా మారడం వల్లే మృత్యుస్పర్శగా తయారైందని సారథి ఊహ. అంకురించడానికి కూడా ఆ 'మృత్యు స్పర్శే' కారణం అయి ఉంటుందని అతని అనుమానం. అలాంటి

శారీరకమైన 'సెక్స్' అనుభవాన్ని వదులుకోవడానికి ఇప్పుడు తను సంసిద్ధుడే!

'క్షయ రావడానికి కారణమేమిటి?' అని డాక్టర్ని సూటిగా ప్రశ్నించాడొకసారి. డాక్టరు రామం తన స్నేహితుడు. అతను ఏవేవో కారణాలు సూచించాడు. అవన్నీ తన విషయంలో వర్తించేవి కావు. క్షయ తన వంశంలో లేదు. తనకెప్పుడూ మలేరియా రాలేదు. తను బలహీనుడూ కాలేదు. పరిసరాల్లో, తిండిలో ఎక్కడా లోపం రాలేదు. కాని తనలో ఏదో అసంతృప్తి మాత్రం- మనస్సుకీ శరీరానికీ మధ్య అవ్యక్తమైన సంఘర్షణ ఫలితం కాబోలు అది- క్రమంగా ప్రస్ఫుటమవుతూ వస్తోంది. అది పిల్లలు లేకపోవడం వల్ల కాబోలు అనుకున్నాడు. పెళ్లయి అయిదేళ్లవుతోంది. ఇప్పుడు తను తండ్రి కాబోతున్నాడు. క్షయ వచ్చింది. రెండింటిలో ఏదో ఒకటి జరగకపోతే అర్థం ఉండేది. రెండూ ఒకసారే జరగటం జీవితం ఎంత అర్థరహితమో నిరూపిస్తోంది.

సెక్స్ అనుభూతి విషయంలో మనస్సుకీ, శరీరానికీ విభేదాన్ని కల్పించడం తర్కించి చూస్తే సబబుగా తోచదు. కంటికి మాత్రమే కనిపించి (కన్ను మూసినా తెరచినా) స్పర్శకి అందుబాటులో లేనిదాన్ని 'మానసిక'మనీ, స్పర్శ వగైరా ఇంద్రియాలకి అందుబాటులో ఉండేదాన్ని 'శారీరక'మనీ వింగడించడం సవ్యంగా తోచదు. అన్ని ఇంద్రియాలూ శారీరకత చెందినప్పుడు, ఏ ఇంద్రియంతో అనుభవించినా అది శారీరకానుభవమే అవుతుంది. పోనీ నిర్వచనంలో ఇంద్రియాలకు బదులు ఇంద్రియార్థాలకే ప్రాధాన్యం ఇస్తే, అప్పుడు సర్వవిధాలైన అనుభూతులూ- స్పర్శ, సంపర్కం, రుచి కూడా మానసికమేనని సిద్ధాంతం చేయాలి. మరి కంటితో అనుభవించడానికీ, కౌగిలితో అనుభవించడానికీ తేడా ఏమిటి? తాత్త్వికంగా ఏమీ లేదు! కంటితో అనుభవించి ఎందుకు తృప్తి చెందరాదు?

పోతే కంటికీ, వంటికీ ఒక సంబంధం ఉంది. కంటితో చూస్తే కలిగే ఆకర్షణే స్పర్శకూ, కౌగిలింతకూ ప్రేరణ అవుతున్నది. చూచినదాన్ని అందుబాటులోకి, స్వాధీనంలోకి తెచ్చుకుని దాన్ని 'నిజం' చేసుకోవాలనే తాపత్రయమే మనిషికి అన్ని ఆవేదనలూ. కనిపించే ఇంద్రధనుస్సు 'నిజం' కాదా? అది 'అక్కడ' లేదు! చంద్రుణ్ణి చేరుకోవచ్చుగాని, ఇంద్రధనుస్సుని అందుకోవడం వీలుపడదు కదా! ఇంద్రధనుస్సు రంగులు మన కన్నులు మాత్రమే అనుభవించగలిగే నిజం. అందుకే మనుష్యులు దాన్ని గట్టి 'నిజం'గా పరిగణించరు!

ఆకాశంలో చంద్రుడు అమృతమూర్తిగా కనిపిస్తాడు. ఐస్‌క్రీంలా తినెయ్యాలనే కోరిక పుడుతుంది. ఆ చంద్రలోకం ఎంత అందంగా, హాయిగా ఉంటుందో అనిపిస్తుంది. మానవుడు చంద్రుణ్ణి గూర్చి తరతరాలుగా కన్న కలలు సాహిత్యం నిండా వ్యాపించి ఉన్నాయి. కాని చంద్రుడు మానవునికి అందుబాటులోకి వచ్చేప్పటికి ఆ అనుభవం ఎలా ఉంది? వెడితే అక్కడ కొండలూ, గోతులూ, ఎడారీ తప్ప మరేమీ లేదు! అలా నిజమైన చంద్రుణ్ణి ఏం చేసుకోను! అక్కడి నుంచీ చూస్తే భూమి దివ్య సుందరంగా దర్శనమిచ్చిందట! చూపులో ఉన్న ఆనందం పొందటంలో లేదే!

తన మనస్సు 'శరీరం' నుంచీ వేరుపడుతోంది. అలా వేరుపడటంలోనే స్వచ్ఛమైన ఆనందం ఉన్నది. స్వేచ్ఛ ఉన్నది. శరీరాన్ని గూర్చి, శారీరకమైన 'సెక్స్'ని గూర్చి ఇక తను తాపత్రయపడకపోవడమే వివేకం అనుకున్నాడు సారథి.

ప్రొద్దున సూర్యోదయ దృశ్యం ఎంత ఆహ్లాదకరంగా ఉంది. తర్వాత కాస్సేపటికి రిక్షాలో డాక్టరు దగ్గరికి వెడుతుంటే ఆ సూర్యుని కిరణాలు శరీరానికి కలిగించిన బాధని సహించలేకపోయాడు. మనుష్యులు దూరం నుంచీ చూస్తున్నంతసేపూ చైతన్యంతో, ఏదో చేస్తూ, మాట్లాడుతూ, నవ్వుతూ, కోపగిస్తూ అద్భుతంగా ఆసక్తినీ, ఆనందాన్నీ కలిగిస్తారు. మానవజాతి సమస్తాన్నీ తను ప్రేమిస్తున్నట్లే ఉంటుంది. కాని ఒక రిక్షా మాట్లాడుకోవాలన్నా, ఒక అంగడిలో వస్తువులు బేరం చేసినా- మనుష్యులు చేసే జావ్యం, పెట్టే పేచీలూ, తికమకలూ...

పాలవాడూ, కూరగాయలవాడూ చేసే మోసాలు విసుగునీ, చిరాకునీ కలిగించడమే కాదు- ద్వేషాన్ని కూడా రగిలిస్తాయి! మనుష్యుల పట్ల సామూహికంగా తనకు ద్వేషం లేదు. పెద్దగా ప్రేమా లేదు! కాని ఒక్కొక్క వ్యక్తి పట్ల తనకి ఆసక్తీ, జాలీ, ఆప్యాయతా కలుగుతాయి.

డాక్టరు చేత ఇంజక్షను చేయించుకోవడం కంటే, నర్సు నిర్మల చేత ఎక్స్‌రే తీయించుకోవడమే సరదాగా ఉంటుంది! ఆమె చాలా నాజూకుగా మల్లెపువ్వులా ఉంటుంది. పొంకంగా వున్న ఆ వక్షానికీ, వీలైన స్పష్టమైన హావభావాలకూ తగినట్లు ఎందుకోగాని ఆమె కళ్లల్లో చురుకుదనమూ, ఆహ్వానమూ కనిపించవు. నిస్పృహాయుతా, పరారీతత్వమూ మాత్రమే కనిపిస్తాయి. ఆమెను చూస్తూంటే 'అడవిగాచిన వెన్నెల' జ్ఞాపకం వస్తుంది. ఆమె మీద ఎందుకో ఆప్యాయత కలుగుతుంది.

ఇవాళ ఎక్స్‌రే చూచి డాక్టరు రామం అన్నాడు – 'స్పాట్స్ అన్నీ ఇంచుమించు కవరైపోయినట్లే! రిమార్కబుల్ ఇంప్రూవ్‌మెంట్, సారథీ! ఇంకొక మాసంలో డ్యూటీలో జాయిన్ కాదల్చుకున్నా కావచ్చు. అఫ్‌కోర్స్, ఉండవలసిన జాగ్రత్తలో ఎలాగూ ఉండక తప్పదు.'

'నీకు ఎలా కృతజ్ఞత తెలుపుకోవాలో తెలీదు రామం! నీకూ, నర్స్ నిర్మలకీ ఎంతో ఋణపడి ఉన్నాను. ఆమెతో వ్యక్తిగతంగా మాట్లాడి థాంక్స్ చెప్పాలని ఉంది' అన్నాడు సారథి.

'ఏం, ఇంతవరకూ ఆమెతో ఎప్పుడూ మాట్లాడనే లేదా?'

'లేదు. ఆమె చాలా ముక్తసరిగా ఉంటుంది. అలా ఊరికే మాట్లాడే రకంగా కూడా తోచదు. అయినా నేను వచ్చినప్పుడు ప్రతిసారీ ఏ లోటూ లేకుండా ఆదరంతో చూస్తుంది. అందుకే నాకు అభిమానం ఏర్పడింది. వ్యక్తిగా ఆమె మీద ఆసక్తి కూడా కలిగింది...?'

'కలిగిందీ! నీకు ఆడవాళ్ల జోలి పనికిరాదని చెబుతూనే ఉన్నానుగా' అన్నాడు నవ్వుతూ రామం.

'జోలి అంటే కేవలం మనిషిగా కూడా ఆసక్తి చూపించడానికి వీల్లేదా?'

'అందులోనే ప్రమాదం ఉంది. మరి. ప్రారంభంలో అంతా అమాయకంగానే ఉంటుంది.'

'అదికాదు నా అభిప్రాయం. ఆమెను చూస్తే ఒక కుతూహలం. క్షయ మూలంగా నేను పోగొట్టుకొన్నదేమిటో అర్థం చేసుకుని, సమాధానపడటానికి ప్రయత్నం చేస్తున్నాను. మరి ఏ వ్యాధీ లేని నిర్మల లాంటి వాళ్లు జీవితంలో ఎలా సమాధానపడుతున్నారా? అనిపిస్తుంది. అందుకే ఆసక్తి చూపించాను.'

రామం నవ్వేశాడు. సారథి వైపు అదో విధంగా చూశాడు.

'సారథీ! ఏమిటి నువ్వనేది! నల్లనివన్నీ నీళ్లు, తెల్లనివన్నీ పాలు అని తప్ప అంతకంటే నువ్వు తెలుసుకోలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. నిర్మలా ఈజ్ ఎ బిచ్! కొంచెం రేటు ఎక్కువే అనుకో. నీకు ఒంటికి పడదనే తప్ప, నువ్వు కావాలంటే అందుబాటులోనే ఉంది' అన్నాడు.

సారథికి తల తిరిగినట్లయింది.

'మరి అలాంటిదాన్ని నీ నర్సింగ్ హోంలో...' సందేహం వెలిబుచ్చాడు సారథి.

'అలాంటివాళ్లే పనికొస్తారు. బిజినెస్ లైక్‌గా, సైంటిఫిక్‌గా ఉంటారు. హృదయ సంబంధమైన జబ్బులు వాళ్లకు రావు. రొమాన్స్‌కి ఇమ్యూన్‌గా ఉంటారు. లేనిపోని ఊహలతో, ఆశలతో తలనొప్పి తెచ్చుకోరు, తెచ్చిపెట్టరు.'

ఆ ప్రస్తావన అంతటితో ముగిసింది. నిర్మలతో మాట్లాడాలని మళ్లీ రామంతో అనలేదు. తిరిగి వస్తూ తనలో నిర్మల పట్ల కలిగిన అభిప్రాయాన్ని

## అంతర్ధానం

నేను కష్టపడి
కూడబెట్టుకున్న డబ్బుని
వడ్డీ రూపంలో పిల్లలు పెడుతుందని
ఒక ఫైనాన్స్ కంపెనీలో పడేశాను
పిల్లలు పుట్టలేదు సరికదా
'అసలు' రూపంలోని అమ్మ కూడా
అంతర్ధానమయిపోయింది!

– తాజీ ప్రసాద్.

గూర్చి తర్కించుకున్నాడు. ఆలోచించేకొద్దీ తన మొదటి అభిప్రాయానికి, రామం చెప్పిన వివరాల వల్ల వచ్చిన భంగపాటు ఏమీ లేదు. నిర్మల పట్ల కలిగిన ఆప్యాయత ఇప్పుడు జాలిగా మారింది. పాపం! ఏం చేస్తుంది. ఈ మనుష్యులూ, ఈ వ్యవస్థ ఆమెనట్లా తీర్చిదిద్దాయి!... కానీ...

జాలి? ఎందుకు జాలి? ఆమె మర్యాదస్తురాలు కాలేకపోయిందనేనా? ఆమె ఎవణ్నో కట్టుకుని, వాడి అధికారానికి లోబడి బ్రతకటం లేదనేనా? ఆమె బ్రతుకుతున్న విధానం, ఆమెకు తృప్తినిస్తూ ఉందో లేదో తనకేం తెలుసు? సమాజానికి ఒక మార్గం, ఒక నీతి ఉందని భ్రమపడతాము గాని, సమాజంలోని మనుష్యుల్లో ఒకరి మార్గం మరొకరిది కాదు! అందరిలోనూ రెండు ముఖాలు ఉన్నాయి. ఒకటి సమాజపరంగానూ, మరొకటి వ్యక్తిగతంగానూ ఉంటుంది. సమాజపరంగా ఉండేది ముసుగు మాత్రమే! దాని వెనుక ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లుంటారు.

నిర్మల వేసుకున్న ముసుగు- పెళ్లికాని నర్సుగా- బాగానే ఉంది. వ్యక్తిగతంగా ఆమె జీవిస్తున్న జీవితమూ అమెకి బాగానే ఉండవచ్చు. బాగా లేదనడానికి సారథి, తనెవ్వరు? తనకి నర్సుగా ఆమె చేసిన సేవ, యువతిగా కలిగించిన ఆహ్లాదమూ, నిజంకాక అబద్ధమెలా అవుతాయి? ఆమె యవ్వనము 'అడవిగాచిన వెన్నెల' అనుకొని ఆప్యాయత ననుభవించడం కాని, ఆమె రహస్య జీవితాన్ని గూర్చి విని జాలిపడటం కాని, పై నిజాన్ని మరీ దగ్గరగా అందుబాటులోకి తెచ్చుకునే ప్రయత్నంగా దాని తాలూకు సౌందర్యాన్నీ, విలువనీ నాశనం చేస్తున్నది. చంద్రుణ్ణి భూమి మీద నుంచే, దూరం నుంచే చూడాలి, దగ్గరకు వెడితే ఏముంది? నీ జాలీ, జోక్యం అవతలి వాళ్లకు అక్కరలేదు!

అందుకే ఎదురుగుండా నిత్యమూ కనిపించే ఆ గుడిసెలోని స్త్రీ విషయంలో కూడా వివరాలు తెలుసుకోవడం అనవసరమే!

❖ ❖ ❖

స్నేహితుడు విశ్వాన్ని రైలెక్కించడానికి సారథి స్టేషన్‌కెళ్లాడు. విశ్వం ఇంజనీరింగ్ చదివాడు. నాలుగేళ్లు నాగార్జునసాగర్‌లో పనిచేశాడు. తాత్కాలికమైన ఉద్యోగమేనని, పనిలోంచి తొలగించారు. ఏడాదికి పైగా ఎన్ని ప్రయత్నాలు చేసినా మళ్లీ ఉద్యోగం దొరకలేదు. ఎన్నో ఆశలు పెట్టుకుని చదివించారు తల్లిదండ్రులు. ఆర్థికంగా లేకపోయినా తెలివైన కుర్రవాడనీ, ఇంజనీరింగ్‌లో సీటు వచ్చిందనీ, ఉన్నదంతా ఊడ్చిపెట్టి పస్తులుండి చదివించారు. ఒక ఊరివారు. విశ్వం కుటుంబం తనకు తెలుసు.

విశ్వం ఒక కొయ్య పెట్టె, ఒక మడత మంచం పట్టుకొచ్చి- 'ఇందులో పుస్తకాలున్నాయి. ఈ రెండు వస్తువులూ అట్టేపెట్టు. తిరిగి వచ్చాక తీసుకుంటాను' అన్నాడు.

'ఏం, ఉద్యోగం దొరికిందా? ఏ ఊరెడుతున్నావ్?'

'ఉద్యోగం దొరకలేదు. శ్రీకాకుళం వెళుతున్నాను.'

## నింగి నేల నీవై...

నా పాట నీ పాదాల చెంత మూట విప్పింది
కొమ్మల్లో తన గొంతును పువ్వుల్లా చెప్పింది
నీ కళ్లు
వెన్నెల్లో తడిసే నల్లని ద్రాక్ష పళ్లు
నా కళ్లలో ప్రతిరేయి స్వప్నాలని జారవిడుస్తావు
నిదురలో సైతం హృదయానికి నిప్పంటిస్తావు
మౌనం నీ పెదాలపై ఉందంటే
నా హృదయంలో తుఫాను పుట్టిందన్నమాటే
శ్వాసకు తెలుసు గాలి విలువ
నాకు తెలుసు నీ చూపు చలువ
కౌంగులో కోటి కోరికల్ని నింపుకుని
జీవితం జీవించడానికే అంటావు
నువ్వు మాత్రం నాలోకి మంటల్ని
రువ్వడానికే వుంటావు
పరిమళం పువ్వును ఆక్రమించుకున్నట్టు
శబ్దం తుఫానును ఆశ్రయించుకున్నట్టు
నువ్వు నా హృదయంలో మాత్రమే వుంటావు
నింగి నేల నీవై నాలో ఉదయిస్తుంటావు

- వై. శ్రీరాములు.

'ఎందుకు శ్రీకాకుళం?'

'అంతకంటె ప్రస్తుతం చేసే పనేం లేదు గనక.'

చివరకు విశ్వం వివరించాడు. వెళ్లి విప్లవకారులతో కొంతకాలం గడుపుతాడట. ఈ వ్యవస్థలో యువకులకూ, ప్రజ్ఞావంతులకూ అవకాశం లేదు. రాజకీయంగా, నైతికంగా కుళ్లిపోయిన ఈ వ్యవస్థని మార్చడం సాధ్యం కాదు. దీన్ని కూకటివేళ్లతో పెళ్లగించాలి. దీన్ని తుడిచిపెట్టాలి. మసి చెయ్యాలి. శ్రీకాకుళం నుంచీ ఈ దావాగ్ని వ్యాపిస్తూ వస్తూంది... విశ్వం ఈ ధోరణిలో ఆవేశంగా మాట్లాడాడు.

'ఇంతకూ నువ్వెళ్లి చేసేదేమిటి?'

'రక్తం కళ్లజూడటం. ఈ వ్యవస్థ మూలస్తంభాలని కూలద్రోయటం. ప్రజా విరోధుల గుండెల్లోకి తూటాలు పేల్చటం.'

'వాళ్లెవరో నీకు తెలీదు. అంటే వ్యక్తిగతంగా ఎరుగని మనుష్యుల్ని వాళ్లు ధనవంతులని తెలిసినంత మాత్రాన, విప్లవ సిద్ధాంతం కోసం చంపబూనటం, హృదయావేశంతో సంబంధం లేని ఆ పని కేవలం యాంత్రికమైనది కదా, అది నిన్నూ యంత్రంగా మార్చివేస్తుంది. నువ్వూ ఒక కీలుబొమ్మవే అవుతావు. వ్యక్తిత్వం, వెర్రి సిద్ధాంతాలకు బలిపెట్టాక, మిగిలేదేమీ ఉండదు...' సారథి వాదన.

'నువ్వు ఎవళ్లని మనుష్యులంటున్నావు? వాళ్లు మనుష్యులు కారు, రాక్షసులు...! హృదయావేశం-అంటే వ్యక్తిగతమైన ద్వేషం లేకుండా విప్లవం కోసం కర్తవ్యం నిర్వహించడమే కదా ఉత్తమ మార్గం... యుద్ధంలో సైనికుడు అలానే చేస్తాడు. సైనికుడు ఆజ్ఞలు శిరసావహించాలి గాని, యుద్ధరంగంలో ఒక్కొక్కరూ సొంతంగా ఆలోచించడం ప్రారంభించకూడదు. ఆ పరిస్థితిలో వ్యక్తిత్వం ప్రశ్నే లేదు!' అని విశ్వం సమాధానం.

'అసలిదంతా ఒక భ్రమ, ఒక ఎండమావిని చూసి పరుగెత్తడం. మీరు సాధించబోయే నూతన వ్యవస్థలో మానవ సంబంధాలు కందెన వేసిన చక్రంలా సులువుగా, ఆప్యాయంగా పరివర్తిస్తాయి అనుకోవడం, అనుకునేంత వరకే బాగుంటున్నది గాని, అందులో నిజంగా నాకు నమ్మకం కలగడం లేదు. విప్లవంలో హుకుంలు జారీ చేసేవాళ్లే రేపు విప్లవానంతరం ఆ అలవాటు వదులుకోలేక, తమ చెప్పుచేతల్లో ఉండేవాళ్లని అలాగే ఉపయోగించుకుంటూ, వాళ్లనీ, ప్రజలందర్నీ బానిసలుగా చూస్తారు... అప్పుడేమవుతాయి నీ ఆశలూ, ఆశయాలూ.'

సమాధానంగా విప్లవాత్మక మార్క్సిజమ్‌ను గురించి విశ్వం ఎంతో వాదించాడు. అలాంటి పర్యవసానం ఉండదన్నాడు. చివరకు ఒక్క మాట అన్నాడు. 'పోనీయ్ సారథీ! భవిష్యత్తును గూర్చి, విప్లవకారుల మనః పరిణామాన్ని గూర్చి మనం ఇప్పుడెందుకు ఆలోచించడం! ఈనాటి పరిస్థితిలో, నాకు స్వయంగా ఇంతకంటే చెయ్యవలసిన మంచి పని మరొకటి కనిపించదు! ఏదైనా ఉంటే నువ్వు చెప్పు, చేస్తాను... ఉద్యోగం ఇస్తే చెయ్యనన్నానా? కబుర్లు చెప్పి కపట నాటకాలాడుతూ, నీతులు వల్లిస్తూ వ్యవస్థని చేజిక్కించుకుని, యువకుల్నీ, అమాయకుల్నీ, పేదవారిని హింసిస్తున్న రాక్షసులపై యుద్ధం ప్రకటించడం, ఇప్పటికిదే కర్తవ్యం. ఇదే జీవితం, రేపటి సంగతి అక్కరలేదు. భవిష్యత్తు బాగుంటుందనే ఆశతోనే ముందుకు వెడదాం. అందుకు శ్రీకాకుళం వెళ్లే ఏర్పాటు చేసుకున్నాను. అక్కడ నన్ను ఆహ్వానించే మిత్రులున్నారు...' అంటే ఇక్కడ లేరనేగా భావం!

సారథికి అతని మనఃస్థితి అవగాహన అయింది. అతనితో స్టేషన్‌కి వెళ్లాడు. గార్డు విజిల్ ఇచ్చాడు. రైలు కదిలింది. విశ్వం ముందుకు సాగిపోతుండగా నిలబడి చూస్తున్నాడు సారథి. ఇంతలో రైలు ఆగిపోయింది. ప్లాట్‌ఫారమ్ మీద సంచలనం. జనం పరుగెత్తారు. గుంపు చేరారు. సారథి అటువైపు వెళ్లాడు. ఎవరో పదకొండేళ్ల కుర్రాడు రైలందుకోవడానికి పరుగెత్తి రైలుకీ, ప్లాట్‌ఫారమ్‌కీ మధ్య ఇరుక్కుపోయాడు. బయటికి తీశారు. అతని రెండు కాళ్లూ విరిగిపోయాయి. రక్తపు ముద్ద అయిపోయాడు. అంతా అయిదు నిముషాల్లో అయిపోయింది. రైలు బయలుదేరింది. సారథి వెనక్కి నడిచాడు. విశ్వం మళ్లీ కనిపించలేదు. రైలు వెళ్లిపోయింది.

తిరిగి వస్తూంటే కాళ్లు తెగిన ఆ రక్తపు ముద్ద

కళ్లకు కట్టినట్లయింది. ఆ కుర్రాడు బ్రతుకుతాడా? బ్రతికినా కాళ్లు లేని వాని జీవితం ఎలా ఉంటుంది? విశ్వం రైలెక్కి వెడుతూండగా అలా జరగటం శుభసూచకంగా లేదే!

❖ ❖ ❖

సారథి మళ్లీ ఉద్యోగంలో చేరాడు.

ఏకాంతం వదలి మనుష్యుల్లో పడ్డాడు.

క్షయ నయమైందని డాక్టరు చెప్పిన తర్వాత మానసికంగా తనలో వచ్చిన మార్పు సారథికి చికాకు కలిగిస్తోంది. ప్రొద్దుటిపూట పదింటికి ఆఫీసుకి బయలుదేరేదాకా పూర్వంలాగా వరండాలో కూర్చుని పేపరు ముందు పెట్టుకుని ఆ గుడిసెలోని స్త్రీని గమనిస్తూ ఉంటాడు. కాని, సాయంత్రాలు మాత్రం ఒక్కోరోజు ఆమె స్నానం చేసే వేళకు ఇల్లు చేరుకోలేకపోతున్నాడు. క్షయ మూలంగా ఏకాంతవాసం చేసిన రోజుల్లో ఏర్పరచుకున్న సిద్ధాంతాల్నీ, జాగ్రత్తల్నీ అతను మరచిపోలేదు. కాని ఆఫీసుకు వెళ్లి రావడంలో, సినిమాలకు వెళ్లడంలో అతని మనస్సు ఉద్వేగాన్ని అనుభవిస్తూ కోర్కెలని ఆకట్టుకోలేకపోతోంది. ఈ లోకంలో కనిపించే సౌందర్య సర్వస్వాన్నీ తనలో కలుపుకోవాలనే కోర్కె శారీరకమైన 'సెక్స్' వాంఛగా మళ్లీ మళ్లీ తలెత్తుతూ ఉంది. కాని క్షయతో తూట్లు పడిన ఊపిరితిత్తులూ, నీరసంతో వగర్చే వళ్లూ, శరీరం యొక్క అల్పత్వం ఆ కోర్కెని అపహాస్యం చేస్తున్నది. ఈ దేహంతో అనంతమైన సౌందర్య పిపాస తీరదు. శారీరకమైన 'సెక్స్' ఒక ఉపశాంతి మాత్రమే! నిజానికి ఉపశాంతి కూడా కాదు! ఇది తనకు తెలిసినప్పటికీ, వ్యాధి నయమై శరీరం పుంజుకోవడం వల్ల శరీరం చేస్తున్న ఆందోళన, మృత్యుభయం లేదన్న ధీమా వల్ల అణచుకోవడానికి వీలు లేనిదిగా ఉంటోంది.

మనిషి - అంటే మనస్సు - గొప్ప అవకాశవాది. అందుకే 'స్మశాన వైరాగ్యం - ప్రసూతి వైరాగ్యం' అన్నారు. ఏ తాత్త్విక దృక్పథమూ, రాజకీయ వాదమూ, సామాజిక సిద్ధాంతమూ మనిషిని నియంత్రించలేవు. అవసరానికి ఉపయోగపడతాయి తప్ప. విశ్వం పరిస్థితులకూ, మనస్తత్వానికీ, విప్లవ రాజకీయాలు పనికివచ్చాయి. నిర్మలకు బహుశా శాస్త్రీయ దృక్పథమూ, స్త్రీ స్వాతంత్ర్య సిద్ధాంతాలూ ఉపయోగపడతాయి. క్షయ రోగిగా తనకు సర్వమూ మానసికమేనన్న తత్త్వం వచ్చినట్లు... కాని తనింకా క్షయ రోగినేనన్న సంగతి మరచిపోకూడదు. మరచిపోతే ప్రమాదం...

'అయ్యగారూ... మనకు గుడ్లు సప్లయ్ చేసే ఆడమనిషి ఓ పది రూపాయలు అడ్వాన్స్ కావాలంటోంది. ఉన్న కోళ్లు పొదుగుతున్నాయంట. కొత్త పెట్టలు కొంటానికి డబ్బు పెట్టుబడి కావాలంట. ఆ మనిషయితే నమ్మకంగా తాజా గుడ్లు ఇస్తది. రెండు రోజుల్నించీ ఎక్కడెక్కడో తిరిగొస్తున్నా. మంచివి దొరకటంలే.'

'ఎవరా మనిషి? ఎక్కడుంటుంది?'

'ఇక్కడే, మనింటి వెనకాల గుడిసెలో' అంటూ పళ్లికిలించాడు వెంకయ్య.

'ఎవరు?' అని మళ్లీ అడిగాడు సారథి.

ఎవరో చప్పున తెలిసినా, వెంకయ్య నవ్వు చిరాకు కలిగించింది.

'మీరు మేడమీద వరండాలో కూచుంటే ఆ కనిపించే గుడిసెలో ఉంటాది. మీరు చూసే ఉంటారు.'

'ఆ... ఎవరావిడ? ఆమె భర్త ఏం చేస్తాడు?'

'వాడు లారీ డ్రైవరు. కట్టుకున్నవాడు గాదు, లేవతీసుకొచ్చిన బాపతు.'

'ఏ ఊరు?'

'చిలకలపూడి'

'బందరు దగ్గర చిలకలపూడేనా?'

'ఆఁ అదే! అయితేనేం మంచి మనిషండీ. మరి డబ్బిస్తారా? తనే వచ్చి అడుగుతానంటోంది. అదేగాకుండా... ఆఫీసులో ఏదైనా స్వీపరో, నీళ్ల మనిషో పని ఇప్పిస్తే జాగర్తగా చేసుకుంటా నంటది... మీతో వచ్చి కష్టసుఖాలు చెప్పుకోవాలంట...'

'అలాగే... ఈ పదీ పట్టుకెళ్లి ఇవ్వు.'

మరుసటి రోజు రాత్రి భోజనం చేసి కూర్చున్నాడు సారథి. ముందర బల్లమీద తమలపాకులూ, వక్కపొడి, సున్నం ఉన్నాయి.

వెంకయ్య ఆమెని ప్రవేశపెట్టాడు. వంట ఇంట్లో పనుందని వెళ్లిపోయాడు.

తమలపాకు చేతిలోకి తీసుకుని తొడిమ గిల్లుతూ, 'ఏమిటి?' అన్నాడు సారథి.

'ఇది తీసుకోండి' అన్నదామె.

తలెత్తి చూశాడు. పది రూపాయల నోటు ఇవ్వబోతోంది.

'అవసరం లేదు. కోళ్లు కొన్నాను. డబ్బు అవసరం లేదు' అన్నది వివరిస్తూ.

దగ్గరగా చూస్తే ఆమె చాలా నాజూకు మనిషిగా, దూరం నుంచీ తను ఊహించిన దానికంటే ఆకర్షణీయంగా కనిపించింది. ఆమె చిరునవ్వుతో దగ్గరగా వచ్చి నోటు తనవైపుకి చాచి నిల్చుంది.

తమలపాకుని ఎడమచేతిలోకి మార్చుకుని, ఆ నోటు తీసుకుని పళ్లెంలో పెట్టాడు.

'మరి వెంకయ్యతో అలా చెప్పడమెందుకు?'

'వెంకయ్యకు డబ్బు విషయం చెబితే గాని, ఇక్కడకు తీసుకురాడనీ.'

సారథి ఆమె చొరవకు ఆశ్చర్యపడి అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆమె పళ్లెంలోని ఆకులకు సున్నం రాసి, చుట్టి, వక్కపొడి పోసి చేతికందించింది. వ్రేళ్లు తాకాయి.

'ఏమిటలా చూస్తున్నారు? మేడమీద నుంచీ ప్రొద్దస్తమానం అలా చూస్తూ కూర్చుంటే ఎవళ్లయినా ఎలా సహిస్తారు?' అన్నదామె.

ఆమె తమలపాకు చిలకలు చుట్టుతూ, అందిస్తూ ఉంది.

'నువ్వెలా సహించావ్?' అన్నాడు ఈసారి ఆమె చేతిని పట్టుకుని వదల్లేదు సారథి.

'అబ్బ వదలండి... వెంకయ్య వస్తాడు.'

'వెంకయ్యేగా ఇక్కడికి తీసుకొచ్చాడు?'

'ఇహ నే వెళ్తాను.'

'అంతలోనే? నువ్వు వచ్చిన పనేమిటో చెప్పకుండానే?'

'మీ డబ్బు మీకిచ్చాను. మిమ్మల్ని చూశాను. ఆపైన మీ దయ.'

'నీ పేరేమిటి?'

'రాజమ్మ రాజలక్ష్మి'

'అయితే రాజలక్ష్మీ, నీకేం ఉద్యోగం కావాలి? నువ్వెంతదాకా చదువుకున్నావ్?'

'అయిదో తరగతి... మీ పాదాల దగ్గర ఏ ఉద్యోగమైనా సరే... మీ బాంచను' అన్నది నవ్వుతూ మధ్య కొంటెగా.

'సరే, నువ్వు తెలంగాణా కూడా చూశావన్నమాట.'

'ఆఁ అన్నమాట! ఏడాది ఉన్నం దొరా!' అన్నది తెలంగాణా యాసతో.

'తాంబూలం వేసుకో రాజలక్ష్మీ'

'ఏదీ, మీరివ్వండే!'

సారథి లేచాడు. వెళ్లి గది తలుపు గడియపెట్టి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

తర్వాత ఆమె ఇంచుమించు రోజూ వస్తూనే

## యుద్ధమంటే...

శాంతి అహింసలు
ఓడిపోతే
సహనమన్నది
చచ్చిపోతే
కోపమే
దుందుడుకుతనమే
ప్రలోభమై
విషజ్వాలలై
నింగి నేలా
ఎగసిపోతే
యుగయుగాల
మనిషి మనుగడ
క్షణములోన
బుగ్గిపాలై
ప్రళయ భీకర
ఆర్తనాదం
రక్తసిక్తం
నేలమొత్తు
జీవరాసులు
సమాధులై
సమసిపోవడమే
యుద్ధమంటే...

– బద్ది నాగేశ్వరరావు.

ఉంది. సారథి ఏమి ఇవ్వబోయినా, చీరెలు వంటి బహుమానాలు కాని, వస్తువులు కాని ఆమె తీసుకోవడానికి నిరాకరించింది. గుడిసెలో కాపురమున్నా తనకు దారిద్ర్యం లేదన్నది. వెంకయ్యకు మాత్రం అతని జీతంగాక అదనంగా ఇవ్వమని ఆమె సలహా.

శారీరకమైన 'సెక్స్' మానసికమైన ఆకర్షణ స్థాయిని అందుకోలేదన్న సారథి సిద్ధాంతం కొత్త అనుభవంతో నిరాధారమని తేలింది. మనస్సు మనస్సుగా అందుకోలేని శిఖరాగ్రాన్ని దేనినో ఈ అనుభవం అందుకుంటోంది. సారథికి ఇప్పుడు సందేహాలూ, ఊహలూ రావడం లేదు. ఆమె రాకకు ఎదురుచూడడమే మనుగడకి అర్థం, పరమార్థంగా ఉన్నది. నిజానికి ఈ అనుభూతి శరీరాన్నీ, మనస్సునీ అధిగమించిన దివ్యానుభూతిగా ఉంది.

ఒక నెల గడిచింది. సారథికి మాత్రం రాత్రిపూట దగ్గు వస్తోంది. రాజలక్ష్మి ఇప్పుడు మూడు నాలుగు రోజులు వరుసగా వెంకయ్య చేత కబురు పెట్టితేగాని రావడం లేదు. వచ్చినప్పుడు, 'మీ ఆరోగ్యం జాగ్రత్త. మీరు డాక్టర్ని చూశారా?' అంటున్నది.

సారథికి డాక్టరు దగ్గరకు వెళ్లడానికి మనస్కరించడం లేదు.

సారథికి మగపిల్లవాడు పుట్టాడని టెలిగ్రాం వచ్చింది.

రాజలక్ష్మితో చెప్పాడు.

'ఇహనేం! వెళ్లిరండి... మీ ఆవిడ కూడా వచ్చేస్తుంది తొందరలోనే!'

సారథి ఆలోచిస్తున్నాడు. ఏమీ అనలేదు.

'వచ్చే నెలలో మేం కూడా వెళ్లిపోతున్నాం' అన్నదామె.

'ఎక్కడికి?'

'మరో ఊరు'

'నువ్వు వెళ్లడం దేనికి? వెడితే అతన్ని వెళ్లనీ, ఈ ఊళ్లో మంచి ఇల్లు చూస్తాను. అక్కడు ఉందుగాని, నువ్వేం నాకు భారం కాదు' అన్నాడు సారథి.

ఆమె నవ్వుతోంది. బుగ్గలు మణికి ముద్దుపెట్టుకుని—

'మంచివారే! నా భర్త నన్నిలా వదలి వెళ్తాడా! నన్ను చంపేస్తాడు?'

'నీ భర్తా? నిన్ను లేవదీసుకు వచ్చాడుగా, అతనికేం అధికారం?'

'కాదు, దైవసాక్షిగా తాళికట్టిన భర్త.'

'మరి వెంకయ్య అలా చెప్పాడేం?'

'వెంకయ్యకు అలా చెబితేగాని అర్థం కాదు! మీతో స్నేహం చేసుకోవడానికి ఎన్ని పాట్లు పడ్డాననీ.'

'మరి నీ భర్త ఉండగా నువ్వు చేస్తున్నదేమిటి?'

'ఆయన లోకం చూపించిన మొగుడు, నువ్వు మనస్సుకి నచ్చిన వాడివి.'

'మరి నాతో ఉండక, అతనితో వెళ్లిపోతానంటావేం?'

'అది అంతే! నలుగురూ నడిచే దోవని నడవ్వొద్దా?'

సారథి ప్రాధేయపడ్డాడు. అలిగాడు. ఆశలు పెట్టాడు. ఆస్తి వ్రాసి ఇస్తానన్నాడు. రాజలక్ష్మి ససేమిరా అన్నది.

ఆ రాత్రి ఆమె వెళ్లిపోయాక అతనికి రక్తం వాంతి అయింది. బేసిన్‌లో ఆ ఎరుపు మీద కొళాయి త్రిప్పి, నోరు కడుక్కొని వచ్చి పడుకున్నాడు.

రాజలక్ష్మికి కబురు చెయ్యగా, చెయ్యగా నాలుగు రోజులకి వచ్చింది. ఆమె భర్త ఆ తెల్లవారుజామున వస్తాడట. మరుసటిరోజే తను వెళ్లిపోతుందట, వచ్చేనెల దాకా ఆగదట.

సారథి ఆపిల్ పండు ముక్కలు కోస్తున్నాడు. కత్తి పదునుగా ఉంది. వేలు కోసుకున్న రక్తం చివ్వుమని ముక్కలకు అంటింది.

'మీ రక్తం అంటిన ముక్క నేను తినాలి' అన్నది రాజలక్ష్మి.

ఆ రాత్రి అతని కౌగిట్లో మైమరచి కన్నులు మూసిన క్షణంలో, కత్తి ఆమె గొంతులో గాఢంగా దిగబడింది.

సారథిని పోలీసులు పట్టుకుపోయారు.

విశ్వాన్ని పోలీసులు కాల్చేశారు.

"మృత్యోర్మా అమృతంగమయ" ❑